E-KABURU

# ఈ-కబురు

12-03-2025 బుధవారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

www.ekaburu.com

మళ్లీ నటించేందుకు సిద్ధంగా నటి రంభ

6లో



# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం**

**అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు**

**ప్రభుత్వాన్ని నిలదీసేలా బిఆర్ఎస్ సన్నద్ధం**

**ఈ-కబురు, హైదరాబాద్:** బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి

మిగతా 2లో





# నేను అసెంబ్లీకి వస్తున్నా..

## అంతా సిద్ధం కండి

**అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం**

**ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం**

**బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కెసిఆర్ కీలక ఆదేశాలు**

**ఈ-కబురు, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. నేనూ వస్తు న్నా.. మీరంతా రావాలి..సమస్యలపై పోరాడు దాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. 'హామీల అమల్లో వైఫ ల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో

మిగతా 2లో

## ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ..!



**ఈ-కబురు, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నది.. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిసు న్నాడు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న

మిగతా 2లో

## రాష్ట్రంలో శాంతిభద్రతలకు

# పెద్దపీట

2లో

**గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం**

**అత్యాచారాలు చేసి తప్పించుకకోవడం కుదరదు**

**ఆడబిడ్డలకు రక్షణగా శక్తియాప్ తీసుకొచ్చాం**

**వివేకా హత్య వెనక అసలు కోణం అప్పడు అర్థం కాలే**

**తానెప్పడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించను**

**అసెంబ్లీలో సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**





## మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

**రాజధాని నిర్మాణం కోసం వివిధ మార్గాల ద్వారా నిధులు**

**గతంలో 30వేల ఎకరాలు కావాలన్న జగన్ అమరావతిని నిర్లక్ష్యం చేశారు**

**అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి నారాయణ వెల్లడి**

2లో

## గండిపేట వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

2లో

**ఒక విద్యార్థి మృతి... మరో నలుగురుకి తీవ్ర గాయాలు**

**వీరంతా ఎంజిఐటి విద్యార్థులుగా గుర్తింపు**





## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

**కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**

**ఈ-కబురు, న్యూఢిల్లీ:** రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి -

మిగతా 2లో

## నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

**కొత్త పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం**

**రూ.6000 కోట్ల కేటాయింపు**

2లో

**15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

**డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి.. గత సర్కారు యువతను విస్మరించిందని విమర్శ**



# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

మొదటి పేజి తరువాయి

మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయింపులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు.



## మొదటి పేజి తరువాయి



### రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల పక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు‘ అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలకు పెద్దపీట

**ఈ-కబురు, అమరావతి:** ఆడ బిడ్డలపై అత్యాచారం చేసిన వారు ఇకపై తప్పించుకోలేరని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. రాష్ట్రంలో మత విద్వేషాలు లేని వాతావరణం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఠాల కుమ్ములాటలు..ఇక చెల్లవని..రాష్ట్రంలో రౌడీలు ఉండడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. రౌడీయిజం చేసి తప్పించుకుంటామంటే కుదరదన్నారు. భూ వివాదాల తోపాటు భూ కబ్జాలు భయంకరంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే భూ కబ్జాలపై ప్రత్యేక చట్టలున్నాయని.. అవి గుజరాత్ అమలు చేస్తోందన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా పకడ్బందీ చట్టాలు తీసుకు వస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ.. తాను సైతం ఎన్నికల హడావుడిలో ఉండి వైఎస్ వివేకా హత్యపై అర్థం కానీ పరిస్థితి నెలకుందని వివరించారు. హోమ్ మంత్రి, ఉన్నతాధికారులు, డిజిపి ఇంతమంది ఉండి కూడా వైఎస్ వివేకా హత్య అర్థం కాలేదన్నారు. తామంతా తొలుత గుండెపోటు అనుకున్నామని చెప్పారు. వైఎస్ వివేకా కుమార్తె వైఎస్ సునీత పోస్ట్ మార్టం నిర్వహించాలన్నారు. కాబట్టి అసలు విషయం తెలిసిందని చెప్పారు. నా చేతిలో కత్తి ఫొటో పెట్టి.. నారా సుర రక్త చరిత్ర అని రాయించారన్నారు. తన రాజకీయ జీవితంలో హత్య రాజకీయాలు లేవని ఆయన కుండబద్దలు కొట్టారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు జాగ్రత్త ఉండాలి.. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చెయ్యడం ఎమ్మెల్యేల బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో ఎదురు దాడి చేస్తే తప్పించు కోలేరు.. ప్రేమ పేరుతో మహిళలను ముగ్గులోకి దింపుతున్నారు.. ఇలాంటివి సహించేది లేదు.. చిన్న చిన్న అమ్మాయిలపై అత్యాచారాలు జరుగుతున్నాయి.. ఎక్కడ గంజాయి, డ్రగ్స్ దొరికినా అయిపోతారు జాగ్రత్త అని ఆయన వార్నింగ్ ఇచ్చారు. సమస్యలు చెప్పాలనుకుంటే చెప్పండి.. కానీ, రౌడీయిజం చేస్తే ఊరుకోం.. శక్తి యాప్ అందరూ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.. ఒకసారి ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే బాధ్యత తీసుకోవాలి.. పోలీసులు జాగ్రత్తగా లేకపోతే వారిపై కూడా చర్యలు ఉంటాయి.. దిశ యాప్ ఒక దిక్కుమాలిన యాప్.. శక్తి యాప్ మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజల్లో చైతన్యం లేకపోతే చట్టాలు వృథా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. ప్రజల్లో చైతన్యం లేకుంటే చట్టాలకు విలువ ఉండదని స్పష్టం చేశారు. ప్రతి మహిళ శక్తి యాప్ ను రక్షణగా వాడుకోవాలని సూచించారు. మహిళల్లో చైతన్యం తెచ్చే బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. శక్తి యాప్ అత్యంత శక్తివంతంగా రూపొందించామన్నారు. పోలీసులు నిర్లక్ష్యం వహించినా వారి ఫెయిల్యూర్ సైతం రికార్డు అవుతుందని చెప్పారు. ఇలాంటి ఉదంతాలు వెలుగు చూస్తే పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని రాష్ట్రంలోని ప్రతీ మహిళనూ కోరుతున్నామన్నారు. శక్తి యాప్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈ సందర్భంగా టీడీపీ క్యాడర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంతో కీలకమన్నారు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో గంజాయి.. డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించారని విమర్శించారు.



# నేను అసెంబ్లీకి వస్తున్నా..

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..‘ అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.

# ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ..!

మొదటి పేజి తరువాయి

తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తల్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని



ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనంలో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చింది.

## గండిపేట వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

**ఈ-కబురు, హైదరాబాద్:** నగర శివారులోని గండిపేట మూవీ టవర్స్ వద్ద మంగళవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందగా, హేమసాయి, వివేక్, సుజన్, కార్తికేయ, హర్షకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఐటీ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆరుగురు కారులో నార్సింగి నుంచి నియోపొలిస్ వైపు వెళు ండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. వేగంగా స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. క్షతగాత్రులను సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేట నియో పోలీస్ సర్కిల్ ఆటోస్టాండ్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది . అతివేగంగా వచ్చి ఎలక్ట్రిక్ పోల్ ను ఢీకొట్టడంతో కారు నాలుగు పల్టీలు కొట్టి తుక్కుతుక్కుయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కారులో ప్రయాణిస్తున్న విద్యార్థులంతా ఎంజీఐటీ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ అని సమాచారం. గండిపేట్ లోని కాలేజీ నుంచి హైదరాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. మితి మీరిన వేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

**ఈ-కబురు, అమరావతి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంపై పురపాలకశాఖ మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 64,721 కోట్లు ఖర్చవుతుందని.. వచ్చే మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాజీ సీఎం జగన్.. ఆ తర్వాత ప్లేట్ ఫిరాయించారని ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణం కోసం బహుళ పక్ష ఏజెన్సీలు, భూములు అమ్మడం, లీజుల ద్వారా నిధులు సేకరిస్తామని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్ ఫ్రాస్టక్చర్,ఎల్పీఎస్ మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం 64,721.48 కోట్లు ఖర్చవుతుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నామని.. బహుళ పక్ష ఏజెన్సీలు, బ్యాంకుల నుండి లోన్?లు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటులను పొందడం ద్వారా నిధుల సేకరిస్తున్నామని తెలిపారు. రైతులకు అభివృద్ధి చేసిన ఎ÷-లాట్లను దశల వారీగా మూడేళ్లలో అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.2019-24 మధ్య విధానపరమైన అనిశ్చితుల కారణంగా ఈ పక్రియలో జాప్యం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు భూమిని రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని.. ప్రపంచంలోనే టాప్ 5 రాజధానిగా అమరావతి ఉండాలని సీఎం ఈ ప్రాజెక్ట్ డిజైన్ చేశారని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చులో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ కలిసి 13,400 కోట్లు రుణం ఇస్తున్నాయని వివరణ ఇచ్చారు.కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు 5 వేల కోట్లు లోన్ ఇస్తుంది. హడ్కో నుంచి రూ.11000 కోట్లు రుణం రెండు మూడు రోజుల్లో వస్తుంది. కేంద్రం గ్రాంట్ కింద మరో రూ.1560 కోట్లు ఇస్తుంది. అమరావతి లోపల భూములు అమ్మడం, లీజు ద్వారా అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్?లో తక్కువ వడ్డీకి లోన్ తీసుకోవడం ద్వారా మిగిలిన నిధులు సమీకరిస్తామని మంత్రి నారాయణ అసెంబ్లీలో వెల్లడించారు. అమరావతిలో 106 ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. టెండర్ల పక్రియ పూర్తయి పనులు ప్రారంభించేందుకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్లు ఇచ్చేందుకు అథారిటీ అనుమతి తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు(మెయిన్ రోడ్లు) 165 అడుగులు,185 అడుగులతో రెండేళ్లలో పూర్తి చేస్తాం.. ఎల్పీఎస్ రోడ్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో.. మిగతావి రెండేళ్లు, అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని జగన్ ఇదే అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. కానీ ప్రభుత్వం మారగానే ప్లేటు ఫిరాయించి మూడు ముక్కలాట ఆడి ఎక్కడా రాజధాని ఏర్పాటు చేయలేదు మండిపడ్డారు. గత ఐదేళ్లలో రాజధానికి భూములిచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెట్టారు.

# నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

**ఈ-కబురు, హైదరాబాద్:** నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువత కోసం ‘రాజీవ్ యువ వికాసం’ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 5 లక్షల మంది యువతకు ఈ పథకం కింద స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వెల్లడించారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేషన్లకు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలను అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం



తీసుకున్నారన్నారు. ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలు సీఎం వద్ద, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ వద్ద ఉన్నాయని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో వారు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారన్నారు. ఇప్పటికే టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, ఇంకా మిగిలిపోయిన వారికి స్వయం ఉపాధి పథకాలను అందించాలని నిర్ణయించామని చెప్పారు. అందులో భాగంగానే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కిందో ఒక్కో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగికి రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సాయం అందిస్తామని చెప్పారు. ఇందుకోసం రూ.6000 కోట్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఒక్కొక్కరికి అందించే ఆర్థిక సహాయంలో బ్యాంకు లింకేజీ ఉంటుందన్నారు. రూ.3 లక్షలు పూర్తిగా సబ్సిడీనా? బ్యాంకు రుణమా? ఎంత శాతం సబ్సిడీ? అనే వివరాలను త్వరలో వెల్లడిస్తామని భట్టి చెప్పారు. విధివిధానాలు, లబ్ధిదారుల అర్హతలు వంటి వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. లబ్ధిదారుల వయసు 55 ఏళ్లకు మించి ఉండరాదని తెలిపారు. పథకానికి సంబంధించి ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఏప్రిల్ 5 వరకు నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు.

## నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: ఏలేటి

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిజెపి క్రియాశీల పాత్రపోషిస్తుందని బిజెపి స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగంలో మంచిచెడులను విశ్లేషించి స్పందిస్తామని బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. గడిచిన డిసెంబర్‌లో మొదటి సారి గవర్నర్ ప్రసంగంలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెపం తెచ్చే ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై మాట్లాడాలన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..అంతకు ముందు కాళేశ్వరం మీద అఖిల పక్షం టూర్ పెట్టారని.. ఇప్పుడు ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో 12 వేలకు పైగా గ్రామాల్లో ప్రభుత్వ పనితనంపై అఖిల పక్షం టూర్ పెట్టాలని.. తాము వస్తామని అన్నారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్ళ గురించి తాము మాట్లాడమని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరెంటు, నీళ్లు, విద్య, ఉద్యోగం, రైతాంగం, మహిళలు, నిరుద్యోగ యువత, సంక్షేమ పథకాలపై ప్రతి పక్ష పార్టీగా తామే మాట్లాడతామని అన్నారు. రాష్ట్రం విడిపోక ముందు రూ 800 కోట్లు ఉంటే 2014 తరువాత రూ. 5 వేల కోట్లకు కేటాయింపులు పెరిగాయన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక ఎన్ని వేల కోట్లు అప్పులు చేసారో సభలోనే చర్చిద్దామని అన్నారు.

## పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

**హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల కేటగిరి 2 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ. 2000 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా దుష్ప్రచారం

### మండిపడ్డ బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నా రాజకీయ భవిష్యత్‌పై గత రెండు రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆర్ఎస్పీ హెచ్చరించారు.నేను రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో, ఏ వర్గాల భవిష్యత్ కోసం పనిచేయాల్నో నాకు క్లారిటీ ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మీ లాగా పదవులకోసం ఢిల్లీకి మూటలు మోసే సంస్కృతి నాకు లేదు. అన్ని పైసలు కూడా నా దగ్గర లేవు. తెలంగాణలో తరతరాలుగా అణచివేతకు గురైన వర్గాల విముక్తికి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ సరైన వేదిక అని బలంగా నమ్మి ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. రేపు బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రోత్సాహంతో తెలంగాణ 2.0ను ఎలా సృష్టించాలన్న పనిలో బిజీగా ఉన్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## టిటిడి పరకామణిలో చేతివాటం

### ఉద్యోగి సస్పెన్షన్

**తిరుపతి:** విరాళాలుగా భక్తులు ఇస్తున్న కానుకలను టీటీడీలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులు పక్కదారి పట్టిస్తున్నారు. దీంతో టీటీడీకి చెడ్డపేరు వస్తోంది. తాజాగా చెన్నైలో టీటీడీ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. టీటీడీకి చెందిన ఆలయ పరకామణిలో జరిగిన చోరీ ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. ఏకంగా శ్రీవారి హుండీలోనే దొంగతనానికి సదరు ఉద్యోగి పాల్పడ్డాడు. శ్రీవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల్లో టీటీడీ సీనియర్ ఉద్యోగి కృష్ణకుమార్ చేతివాటం చూపించాడు. విదేశీ కరెన్సీ రూపంలో స్వామివారికి భక్తులు కానుకలు అందజేశారు. ఇందులో సదరు ఉద్యోగి భారీగా అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ కరెన్సీ లెక్కపెడుతుండగా భారీగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. కరెన్సీ లెక్కింపులో భారీగా తేడాలు ఉన్నట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఘటన బయటకు రావడంతో దొంగతనానికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావుకు కమిటీ నివేదిక సమర్పించింది. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు కృష్ణకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల శ్రీవారి దర్శన బ్లాక్ టికెట్ల దందా గుట్టురట్టయిన విషయం తెలిసిందే. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు బ్లాక్‌లో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. టీటీడీ ఆస్తులను భద్రంగా ఉంచాలని శ్రీవారి భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

### అసెంబ్లీ ముందు ఆందోళనలు, ధర్నాలు నిషేధం

**హైదరాబాద్:** శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులు అసెంబ్లీ ఆవరణలో ఎలాంటి ఆందోళనలు, నిరసనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి,ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు సభ లోపల, వెలుపల శాంతియుత వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభకు సకాలంలో చేరుకొనేలా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బ్జడెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని, గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు... ఆత్మహత్య చేసుకొని మరొకరు...

### ఒకే రోజు ఇద్దరు సాఫ్టువేర్ ఉద్యోగుల మృతి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మియాపూర్ లో ఒకే రోజు ఇద్దరు సాఫ్టువేర్ ఉద్యోగులు మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. భార్యతో జరిగిన చిన్న గొడవతో మనస్థాపానికి గురైన ఓ సాఫ్టువేర్ ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా, ద్విచక్రవాహనం మీద వెళ్తున్న మరో సాఫ్టువేర్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సాఫ్టువేర్ ఉద్యోగి ఆత్మహత్యకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన సంగిరెడ్డి నర్సింహరెడ్డి(28)కి విష్ణుప్రియతో 2023లో వివాహమైంది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉండగా, వీరు మియాపూర్ పరిధిలోని అద్వైత నగర్ క్రిష్ణకాలనీలో



ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్వేర్ ఉద్యోగి నర్సింహరెడ్డి (ఫైల్ ఫోటో)

నివాసం ఉంటున్నారు. నర్సింహరెడ్డి హైటెక్ సిటీ పరిధిలోని ఓ సాఫ్ట్వేర్ సంస్థలో సాఫ్టువేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం మద్యాహ్నం కుమారుడికి అన్నం తినిపించే విషయంలో భార్య, భర్తల మద్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మనస్థాపానికి గురైన నర్సింహరెడ్డి బెడ్ రూమ్ లోపలికి వెళ్లి తలుపు వేసుకొని ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయట ఉన్న విష్ణుప్రియ ఎంతగా పిలిచినా నర్సింహరెడ్డి తలుపు తీయకపోవడంతో స్థానికులతో కలిసి తలుపులు బద్దలు కొట్టి చూడగా, గదిలో ఉన్న ఫ్యాన్ కు వేలాడుతూ నర్సింహరెడ్డి నిర్జీవంగా కనిపించాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**రోడ్డు ప్రమాదంలో...**

మియాపూర్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో సాఫ్టువేర్ ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన అమర్ భాషా కుమారుడు ఆర్. రోషన్(27) చందానగర్ లో నివాసం ఉంటూ హైటెక్ సిటీ పరిధిలోని ఓ సాఫ్ట్వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి 11.40 గంటల ప్రాంతంలో బయటకు వెళు_న్నానని తన రూమ్ మెట్ కు చెప్పి బయటకు వచ్చిన రోషన్ ద్విచక్రవాహనం మీద చందానగర్ నుంచి మియాపూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమద్యలో మదీనగూడ దీప్తిశ్రీనగర్ కమాన్ వద్ద ముందున్న టిప్పర్ లారీని ఒవర్ టేక్ చేసే క్రమంలో రోషన్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషన్ కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# టీఎన్జీవో కాలనీలో పర్యటించిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



టీఎన్జీవో కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కాలనీవాసులతో సమస్యలపై చర్చిస్తున్న దృశ్యం

### సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు : కార్పొరేటర్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి పర్యటించారు. జిహెచ్ఎంసి అధికారులు, స్థానికులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు తమ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని, విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, పారిశుధ్యం పనులు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరారు. దీంతో అక్కడే ఉన్న అధికారులతో ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై కార్పొరేటర్ చర్చించారు. అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తమ కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం, మరియు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ మాటా_డుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ పనులను మరియు రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని, మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని అన్నారు. దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి టీఎన్జీవోస్ కాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలియజేశారు. పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ డయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, డిఈ విసాలాక్షి, జిహెచ్ఎంసి అధికారులు, డివిజన్ నాయకులు, టీఎన్జీవోస్ కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, సీనియర్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు

# ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న యువకుడు, ఇద్దరు మైనర్ల అరెస్టు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడు, ఇద్దరు మైనర్లను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నిజాంపేట్ పరిధిలోని బండారి లేఅవుట్లో నివాసం ఉండే హిమాన్షు(20), అదే కాలనీకి చెందిన ఇద్దరు మైనర్ బాలురు స్నేహితులు. వీరు జల్సాలకు అవసం మైన డబ్బు కోసం ద్విచక్రవాహనాలు చోరీ చేయడం ప్రారంభించారు. ఇదే క్రమంలో మియాపూర్ పరిధిలోని మాధవనగర్ లో ఈనెల 7వ తేదీన నర్సింహగౌడ్ అనే వ్యక్తి తన ఇంటి ముందు పార్క్ చేసిన రాయల్ ఎన్ ఫీల్డ్ ద్విచక్రవాహనం చోరీ చేశారు. ఈ పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా హిమాన్షును అదుపులోకి తీసుకొని విచారించగా, మరో ఇద్దరు మైనర్లతో కలిసి ద్విచక్రవాహనం చోరీ చేసినట్లు అంగీకరించాడు. విచారణలో గతంలో ఆర్సి పురం, కూకట్ పల్లి, బాచుపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో సైతం వాహనాల చోరీకి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు మైనర్లను సైతం అదుపులోకి తీసుకున్న మియాపూర్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించారు. వీరి వద్ద నుంచి 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది.

## పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా

### ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత

**నిజామాబాద్:** నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని కవిత ప్రశ్నించారు. క్వింటా పసుపు పంటకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పసుపు పంటకు కనీసం రూ. 9 వేలు రాని పరిస్థితి ఉందన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని కవిత విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదని అన్నారు. పసుపు పంటకు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారని .. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# బిజెపిలో అప్పుడే కదనోత్సాహం

## కాంగ్రెస్ లక్ష్యంగా రాజకీయ పోరాటం

### రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయ పరిణామాలు తమకే అనుకూలమన్న భ్రమలో కమలం నేతలు ఉన్నారు. ఇదే క్రమంలో రాష్ట్రానికి చేయాల్సిన కేంద్ర సాయంపైనా వాదప్రతివాదనలు సాగుతున్నాయి. అలాగే రానున్న రోజుల్లో మారబోతున్నాయా అనే చర్చ మొదలైంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ ఓడి, బీజేపీ గెలవడంతో ఇక తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమే నంటూ కమలం నేతలు ధీమాలో ఉన్నారు. బిఆర్ఎస్, బిజెపిలు కుమ్మక్కయాయయని మరోవైపు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే రానున్న స్థానిక ఎన్నికలతో పాటు, జిహెచ్ఎంసిలు పాగా వేయాలని బిజెపి ఉవ్వీళ్లూరుతోంది. ఈ ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని బీజేపీ ప్రచార చేస్తోంది. బిజెపికి కొత్త సారథిని ఎంపిక చేయాల్సి ఉంది. అప్పుడే పార్టీలో కొంత చలనం రాగలదని కూడా అంటున్నారు. ఈటెల, రఘునందన్ రావు, డికె అరుణల మధ్య పోటీ నడుస్తోంది. ఇందులో ఈటెల, అరుణలు ఆదినుంచి బిజెపి నేతలు కారన్నవ ఇషయం గుర్తించాలి. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో బీజేపీ గెలుపొందిందని, రెండు పార్టీలు కలిసి తమపై కుట్ర చేసినా తమకు గణనీయమైన సంఖ్యలో ఓట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అయితే బిజెపి, బిఆర్ఎస్ కలసినా కాంగ్రెస్‌ను ఏమీ చేయవని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్‌లో మీనాక్షి నటరాజన్ వచ్చాక మార్పు వస్తుందా అన్నది కూడా చర్చ సాగుతోంది. వీరిందరినీ ఒక్కతాటిపైకి తెస్తారా అన్నది చూడాలి. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. పోటీచేసిన ఒక స్థానంలో కాంగ్రెస్ పరాజయం చవిచూసింది. ఓవైపు బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెసను నమ్మడం లేదని, రానున్న రోజుల్లో తామే ప్రత్యామ్నాయం అంటూ కమలం నేతలు చెప్పుకొస్తున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం ద్వారా బీజేపీ బలపడిందా.. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడనుందా.. తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారబోతున్నాయా.. మార్పులు వస్తే భవిష్యత్తులో ఏ రాజకీయపార్టీకి కలిసొస్తుందనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీ శ్రేణులు మంచి ఉత్సాహంతో ఉన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే ఊపుతో పనిచేసేందుకు హైకమాండ్ కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు తాము మాత్రమే ప్రత్యామ్నాయమనే అభిప్రాయం ప్రజల్లో వచ్చేలనే పక్కా ఎ÷-లాన్‌తో బీజేపీ నేతలు ముందుకెళ్తున్నారు. అయితే ఇది బీజేపీకి అంత ఈజీ కాదనే అభిప్రాయాన్ని కొందరు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో గెలవడంతో పాటు జీహెచ్ఎంసీలో సత్తా చాటిన బీజేపీ అసెంబ్లీ ఎన్నికల నాటికి చతకిలపడింది. రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో బీజేపీ రన్నింగ్ రేసులో వెనక్కి వెళ్లిపోయిదనే ప్రచారం జరిగింది. దీంతో2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 8 శాసనసభస్థానాలను గెలుచుకుంది. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుని, 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. తాజాగా రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడం బీజేపీకి ప్లస్ పాయింట్‌గానే చెప్పుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణలో గతంతో పోలిస్తే బీఆర్ఎస్ బలం కొంతమేరకు తగ్గిందనే చర్చ సాగుతోంది. బీజేపీ బలపడుతున్నప్పటికీ రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను ఓడించే స్థాయిలో ఆ పార్టీ బలం పెంచుకోగలదా.. లేకుంటే బీఆర్ఎస్ తన బలాన్ని పెంచుకుని కాంగ్రెస్‌కు సవాల్ విసురుతుందా అనేది వేచి చూడాలి.

## వైసిపి హయాంలో భారీగా భూ కుంభకోణాలు

### లోక్‌సభలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీగా భూ కుంభకోణం చోటు చేసుకుందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు విమర్శించారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని నిజమైన యజమానులకు భూ హక్కులు పునరుద్ధరించేందుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోక్‌సభలో జీరో అవర్‌లో గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో జరిగిన భూ కుంభకోణాలపై ఆయన గళం విప్పి.. వాటిని ఎండగట్టారు. 40 వేల ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా ఫ్రీహోల్డ్‌గా మార్చారని ఆరోపించారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.14,831 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. అలాగే గత వైసీపీ పాలనలో.. కేంద్ర నిధుల దుర్వినియోగం పై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఏపీ ప్రభుత్వం సవరించిన కొత్త ల్యాండ్ రీ సర్వే, టైట్లింగ్ యాక్ట్‌కు అనుమతి తెలపాలని కేంద్రానికి ఆయన కీలక సూచన చేశారు. ఇక సరిహద్దు రాళ్లకు వైఎస్ జగన్ బొమ్మ వేయడం ద్వారా రూ.700 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. అలాగే అక్రమంగా కేటాయించిన నిషేధిత భూములతో ఇళ్ల స్థలాల పట్టాల పథకం కింద రూ.3 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సోదాహరణగా వివరించారు. మరోవైపు నకిలీ పత్రాలతో విశాఖ,తిరుపతి,చిత్తూరులో రూ.4,939కోట్ల విలువైన పట్టణ భూములను కబ్జా చేశారని విమర్శించారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2022లో మార్పులు చేయడం ద్వారా తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని తన విధేయులకు వైసీపీ భూములు కట్టబెట్టిందని టిడిపి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో చోటు చేసుకున్న పలు అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరుపుతోంది. అందులోభాగంగా ఇప్పటికే పలు అవినీతి, అక్రమాలపై బహిర్గతం చేసింది. ఇక గత ప్రభుత్వ పాలనలో భూ కుంభకోణాలు మాత్రం లెక్కకు మిక్కిలిగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. అందులో పార్టీకి చెందిన పలువురు కీలక నేతల పేర్లు సైతం వెలుగులోకి వచ్చాయి. ఇక జగన్ పాలనలో మూడు రాజధానుల ప్రకటన చేసి.. మూడు ప్రాంతాల్లో అభివృద్ధి అంటూ కీలక ప్రకటన అయితే నాటి సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేశారు. ÷ూనీ వాటి కోసం ఆయన చేపట్టిన చర్యలు అయితే ఏమి లేవన్న సంగతి అందరికి తెలిసిందే. ఇక ఉత్తరాంధ్రలో సైతం భారీగా భూములను ఆ పార్టీ నాయకులు ఆక్రమించుకొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరహా ఆరోపణలు నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వలో జరిగిన భూ కుంభకోణాలను బట్టబయలు చేయాలంటూ శ్రీకృష్ణదేవరాయులు కేంద్రాన్ని కోరారు.

## రెండు బైక్‌లను ఢీకొన్న కర్నాటక బస్సు

**కర్నూలు** :కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదోని మండలం జాలిమంచి వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుప్పగళ్ గ్రామానికి చెందిన వీరన్న (25), ఆదిలక్ష్మి (20) ద్విచక్రవాహనంపై వస్తున్నారు. వీరి వెనుక కర్ణాటకకు చెందిన దేవరాజు, నాగరత్న, హేమాద్రి మరో బైక్‌పై వెళ్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరన్న, ఆదిలక్ష్మి, దేవరాజు, నాగరత్న అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న హేమాద్రిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. సంఘటన స్థలాన్ని ఆదోని డీఎస్పీ పరిశీలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.ప్రమాదవార్త తెలిసిన వెంటనే మంత్రి ఫరూక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# మరో బాదుడుకు సిద్ధమవుతున్న కేంద్రం

## యూపిఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే యోచన

**న్యూఢిల్లీ:** యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు అందరూ అలవాటు పడ్డారు. ప్రజలు నగదు లావాదేవీలను పక్కన పెట్టారు. మోడీ పిలుపుతో అంతా ఆన్‌లైన్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి యూపీఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం
యోచిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే జీఎస్టీ తదితర భారాలు తప్పడం లేదు. బ్యాంకు లావాదేవీలపైనా భారం పడుతోంది. ఇవి చాలవన్నట్లుగా ఇప్పుడు యూపిఐ పేమెంట్లపై మోడీ దృష్టి పడిందని అర్థం చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యూపీఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కథనాలు పేర్కొన్నాయి. వార్షిక ఆదాయం రూ.40లక్షలపైన ఉండే వ్యాపారులకు యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'వీసా, మాస్టర్‌కార్డ్ వంటి డెబిట్ కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండీఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యూపీఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు?' అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే, 'టైర్డ్ ప్రైజింగ్ సిస్టమ్' ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. అంటే.. రూ.40లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యూపీఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావాదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. ఆయా లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది. అయితే, ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీని రూ.3500 కోట్ల నుంచి రూ. 437 కోట్లకు తగ్గించారు.

# డంకీ మార్గంలో వెళుతూ మృత్యువాత

## గుజరాత్‌కు చెందిన వ్యక్తి మృతి

**అహ్మదాబాద్:** అక్రమంగా అమెరికాకు దొడ్డిమార్గంలో వెళ్తున్న భారతీయులను ఆ దేశం వెనక్కి పంపిస్తున్నప్పటికీ కొందరు దీనినే ఎంచుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్రదేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలోనే తాజాగా గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో సహా డంకీ రూట్ లో అమెరికాకు వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. మృతుడిని గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలోని మోయద్ గ్రామానికి చెందిన దిలీప్ పటేల్‌గా గుర్తించారు. దిలీప్ పటేల్ అమెరికాలో స్థిరపడాలనే ఆలోచనతో ఇటీవల ఓ ఏజెంట్‌ను సంప్రదించారు. తన భార్య, చిన్నారితో సహా ముగ్గురిని అమెరికా పంపడానికి రూ.కోటి చెల్లించాలని వారు కోరడంతో తమ భూమిని విక్రయించి.. వచ్చిన రూ.కోటి చెల్లించినట్లు స్థానికులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం అతడు కుటుంబంతో సహా టూరిస్ట్ వీసాపై దుబాయ్ వెళ్లి, అక్కడి నుంచి నికరాగ్వాకు వెళ్లాడు. అక్కడినుంచి డంకీ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడైన దిలీప్ అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో అతడికి మందులు లభించకపోవడంతో అనారోగ్యం తీవ్రమై కోమాలోకి జారుకొని మృతి చెందాడని అధికారులు పేర్కొన్నారు. కాగా మృతుడి భార్యాబిడ్డలు అక్కడే చిక్కుకుపోయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి విదేశాంగ శాఖ సహాయం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి (ఢ్ఞ÷ఞ÷ఙజీ ఓతిఙసజీనిబిబ) గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే.

# డీలిమిటేషన్‌తో సీట్లు పెరుగుతాయి

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆరోపణలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోసిపుచ్చారు. పార్లమెంటు సీట్ల సంఖ్య తగ్గుతుందని జరుగుతున్న చర్చపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. డీలిమిటేషన్‌తో తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన అన్నారు.ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ, డీలిమిటేషన్ ప్రక్రియ ప్రణాళికా బద్ధంగా కొనసాగు తుందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు ఏదైనా అభ్యంతరం ఉంటే వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఆయనకు ఉంటుందని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారని, నిర్ణయం న్యాయంగానే ఉంటుందని చెప్పారు. ÷ూసనసభ అయినా, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుందని అన్నారు. తమిళనాడు, ఆంధప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్లు పెరుగు తాయని, నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలు మాత్రమే ప్రయోజనం పొందుతాయనడం సరైన వాదన కాదని రాజ్‌నాథ్ చెప్పారు. డీలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించాలంటూ ఏడుగురు ముఖ్యమంత్రులకు ఎంకే స్టాలిన్ లేఖ రాసిన నేపథ్యంలో రాజ్‌నాథ్ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది.

## గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

**హైదరాబాద్:** ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

## ఆగమైపోతున్న..తెలంగాన రైతన్న

### నీళ్లు లేక..కరెంట్ రాక వ్యవసాయం అధోగతి

### మరోమారు కాంగ్రెస్‌పై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నా పట్టించుకునే నాధులు లేరని అన్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ అన్నారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనం లో ఉందన్నారు. సాగునీళు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు.

## ఆర్థిక బాధలతో కుటుంబం ఆత్మహత్య

### పిల్లలు ఇద్దరిని చంపి దంపుతుల ఉరి

### హైదరాబాద్ హబ్సీగుడాలో ఘటన

**హైదరాబాద్:** అప్పుల భారం తట్టుకోలేక ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రియల్ వ్యాపారంలో వచ్చిన అప్పులు తట్టుకోలేక ఓ వ్యక్తి పిల్లలను చంపి భార్యతో సహా తానూ ఆత్మహత్య చేసుకున్నారు. కూతురు, కుమారుడిని చంపిన అనంతరం దంపతులు ఉరేసుకున్న సంఘటన హైదరాబాద్ లోని హబ్సిగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?.. కల్వకుర్తికు చెందిన చంద్రశేఖర్ రెడ్డి(45) తన భార్య కవిత(35), కుమారుడు విశ్వాన్ రెడ్డి(14), కుమార్తె శ్రీతరెడ్డి(15)లతో కలిసి హబ్సిగూడలో ఉంటున్నారు. ఓ ప్రైవేటు కాలేజీలో టీచర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల నుంచి ఉద్యోగం చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి.కుమారుడికి విషమిచ్చి అనంతరం కూతురు ఉరేసి చంపారు. అనంతరం దంపతులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నారు. ఒయు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదు అని, వేరే మార్గం లేక తాము ఆత్మహత్య చేసుకున్నామని, క్షమించాలని, కెరీర్ లోనూ. శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని, మధుమెహం, నరాలు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నానని సూసైడ్ నోట్ లో చంద్రశేఖర్ పేర్కొన్నారు. కల్వకుర్తి లో విషాదచాయలు అలుముకున్నాయి. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

### కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ములుగు:** తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. 'ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది.కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.



## దిగొచ్చిన బంగారం: మరోసారి తగ్గిన రేటు

పడుతూ.. లేస్తూ ఉన్న బంగారం ధరలు మళ్ళీ తగ్గుదల దిశగా అడుగులు వేసాయి. నేడు (మార్చి 11) గోల్డ్ రేటు గరిష్టంగా రూ. 330 పెరిగింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం.హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 80,200 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,490 వద్ద నిలిచాయి. నిన్న స్వల్పంగా పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు రూ. 300 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 330 (24 క్యారెట్స్ 10గ్రా) తగ్గింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.చైన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 300, రూ. 330 తగ్గింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 80,200 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 87,490 వద్ద ఉంది.దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 80,350 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 87,640 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 300, రూ. 330 తక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు ఎక్కువగానే ఉంది.

**వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు గరిష్టంగా రూ.1000 తగ్గింది. దీంతో ఈ రోజు (మార్చి 11) కేజీ సిల్వర్ రేటు రూ. 1,07,000 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 98,000 వద్దకు చేరింది.



## యాపిల్ సాఫ్ట్‌వేర్ రీడిజైనింగ్.. కీలక మార్పులు ఇవేనా?

ప్రపంచవ్యాప్తంగా యాపిల్ ఉత్పత్తులకు ఎంత గిరాకీ ఉంటుందో తెలుసుకదా. ప్రత్యేకమైన యాపిల్ సాఫ్ట్‌వేర్ కోసమే చాలామంది వినియోగదారులు కంపెనీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూంటారు. దాంతోపాటు డిజైనింగ్, ఆర్ అండ్ డీ(పరిశోధన, అభివృద్ధి) విభాగం నిత్యం అందిస్తున్న అప్‌డేట్లకు ఫిదా అవుతుంటారు. ఉత్పత్తుల విషయంలో ఇన్నోవేషన్, డిజైనింగ్‌లో ప్రసిద్ధి చెందిన యాపిల్ ఇంక్ చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన సాఫ్ట్‌వేర్ మార్పులకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివర్లో ఈ సాఫ్ట్‌వేర్ రీడిజైనింగ్ ప్రారంభకానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మార్పులు దాని ఫ్లాగ్‌షిప్ పరికరాలైన ఐఫోన్, ఐప్యాడ్, మాక్‌బుక్‌ల్లో వినియోగదారుల అనుభవాన్ని ఏకీకృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



## నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు.. మంగళవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:20 గంటలకు సెన్సెక్స్ 423.38 పాయింట్లు లేదా 0.57 శాతం నష్టంతో 73,691.79 వద్ద, నిఫ్టీ 112.85 పాయింట్లు లేదా 0.50 శాతం నష్టంతో 22,347.45 వద్ద కొనసాగుతున్నాయి.టాప్ గెయినర్స్ జాబితాలో.. నీతిరాజ్ ఇంజనీర్స్, హెడ్స్ అప్ వెంచర్స్, ఎల్‌సీసీ ఇన్ఫోటెక్, ఆస్ట్రాన్ పేపర్ బోర్డ్ మిల్ లిమిటెడ్ వంటి కంపెనీలు చేరాగా.. ఐఓఎల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఆకాష్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, సద్భావ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్, జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ వంటివి నష్టాలలో కొనసాగుతున్నాయి. మార్కెట్ గురించి సాక్షి వెబ్ సైట్లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు.

### 15 నిమిషాల్లో అంబులెన్స్: జెంజో సంస్థ కీలక నిర్ణయం

ముంబై: ఎమర్జెన్సీ సేవల సంస్థ జెంజో దేశవ్యాప్తంగా 450 నగరాల్లో 25,000 ప్రైవేట్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. 15 నిమిషాల్లోపే స్పందించే విధంగా ఈ నెట్‌వర్క్ ఉంటుందని సంస్థ తెలిపింది.

# సిబిల్ స్కోర్ అప్‌డేట్.. ఆర్‌బీఐ ఆరు నిబంధనలు

ఆర్థిక అవసరాలు నిత్యం పెరుగుతున్నాయి. వాటిని తీర్చుకునేందుకు చాలామంది రుణాలు తీసుకుంటున్నారు. ఆర్థిక సంస్థలు రుణాలపై విధించే వడ్డీరేట్లు కూడా భారీగా ఉన్నాయి. మంచి క్రెడిట్ స్కోరు సొంతం చేసుకుంటే తక్కువ వడ్డీకే రుణాలు పొందే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఆర్‌బీఐ కస్టమర్ల రుణ ప్రక్రియను సులభతరం చేయడానికి కొన్ని నిబంధనలు జారీ చేసింది. ఆర్‌బీఐ విడుదల చేసిన ఈ ఆరు నిబంధనలు వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉండనున్నాయి.

**సిబిల్ స్కోర్ అప్‌డేషన్‌లో మార్పులు**

ఆర్‌బీఐ జారీ చేసిన నిబంధనల ప్రకారం క్రెడిట్ స్కోర్ 30 రోజులకు బదులుగా ప్రతి 15 రోజులకు అప్‌డేట్ అవుతుంది. ఈ నిబంధనలు 2025 జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ క్రెడిట్ స్కోర్‌ను వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసుకోవాలని ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించింది. దీనితో పాటు క్రెడిట్ సంస్థలు ప్రతి నెలా కస్టమర్ క్రెడిట్ సమాచారాన్ని సీఐసీ(చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్)కి తెలియజేయాలి.

**తనిఖీ చేస్తే సమాచారం**

బ్యాంకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ ఖాతాదారుల క్రెడిట్ రిపోర్టును తనిఖీ చేసినప్పుడల్లా ఆయా




సమాచారాన్ని కస్టమర్లకు పంపాలని ఆర్‌బీఐ అన్ని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు తెలిపింది. నిబంధనల ప్రకారం ఈ సమాచారాన్ని కస్టమర్లకు పంపడానికి ఎస్ఎంఎస్ లేదా ఇమెయిల్ ఉపయోగించవచ్చు.

**అభ్యర్థన తిరస్కరణకు కారణాన్ని తెలిపేలా..**

ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కస్టమర్ అభ్యర్థనలను బ్యాంకులు తిరస్కరించినట్లయితే దానికిగల కారణాన్ని వారికి చెప్పాలి. తద్వారా వినియోగదారులు వారి అభ్యర్థన ఎందుకు తిరస్కరించబడిందో తెలుసుకోవచ్చని, వారు దాన్ని సకాలంలో మెరుగుపరచవచ్చని ఆర్బీఐ తెలిపింది.

**ఉచిత క్రెడిట్ రిపోర్టులు**

నిబంధనల ప్రకారం కస్టమర్లు తమ క్రెడిట్ హిస్టరీని సరిగ్గా తెలుసుకునేందుకు వీలుగా ఏడాదికి ఒకసారి క్రెడిట్ కంపెనీలకు ఉచితంగా పూర్తి క్రెడిట్ స్కోర్లను అందించాలి. ఇందుకోసం క్రెడిట్ కంపెనీలు తమ వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా లింక్‌ను డిస్‌ప్లే చేయాలి.

**నోడల్ అధికారి నియామకం**

ఏదైనా బ్యాంక్ కస్టమర్‌ను డిఫాల్ట్‌గా ప్రకటించబోతున్నట్లయితే అంతకుముందు ఆర్థిక సంస్థలు ఆ విషయాన్ని సదరు వ్యక్తికి సమాచారం అందించాలి. ఇందుకోసం రుణాలు ఇచ్చిన సంస్థలు ఎస్ఎంఎస్/ ఈ-మెయిల్ ద్వారా ఖాతాదారులకు సమాచారాన్ని చేరవేయాలి. దీనితో పాటు బ్యాంకు లేదా రుణం ఇచ్చిన సంస్థలు నోడల్ అధికారిని (నోడల్ ఆఫీసర్) నియమించాలి. ఖాతాదారుల క్రెడిట్ స్కోర్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ నోడల్ అధికారి పనిచేస్తారు.

**త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం**

ఖాతాదారులకు ఏవైనా సమస్యలు ఉంటే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈ కంపెనీలు 30 రోజుల్లోగా వినియోగదారుల సమస్యలను పరిష్కరించకపోతే రోజుకు రూ.100 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# ఆన్‌లైన్ మోసాల కట్టడికి వినూత్న విధానం

ప్రముఖ టెలికాం ఆపరేటర్లలో ఒకటైన ఎయిర్‌టెల్ తన కస్టమర్లను ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షించేందుకు ప్రయత్నాలు చేపట్టింది. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ స్కామ్(పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డ్ నంబర్లు లేదా వ్యక్తిగత వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడానికి హ్యాకర్లు ఉపయోగించే ఒక రకమైన సైబర్ క్రైమ్) నుంచి కంపెనీకి చెందిన 38 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లకు మెరుగైన భద్రత అందించేందుకు కొత్త సాంకేతికతను అమలు చేయనున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు.కొత్త టెక్నాలజీ అమలు సుమారు 80 శాతం పూర్తయిందని కంపెనీ తెలిపింది. ఈ ప్రతిష్టాత్మక చర్యల వల్ల వన్ టైమ్ పాస్‌వర్డ్‌ల(ఓటీపీ) దుర్వినియోగాన్ని నిరోధించడం, హానికరమైన లింక్‌లను కట్టడి చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొంది. అధునాతన కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించడం ద్వారా ఎయిర్‌టెల్ తన వినియోగదారులకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ టెక్నాలజీ వల్ల రియల్ టైమ్‌లో కస్టమర్లకు వచ్చే మోసపూరిత కాల్స్, స్కామ్ మెసేజ్‌లను గుర్తించి వాటిని అరికడుతుంది. దాంతో వినియోగదారులు ఆన్‌లైన్ మోసానికి గురవుతామనే భయం లేకుండా కమ్యూనికేట్ చేయడానికి, ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి వీలవుతుందని సంస్థ పేర్కొంది.

**పరిష్కారం పరిమితంగానే..**



ఈ టెక్నాలజీ పరిష్కారం పరిధి ప్రస్తుతం ఎస్ఎంఎస్, కాల్ ఆధారిత మోసాలకు మాత్రమే పరిమితమైంది. ఎన్‌క్రిప్షన్ ప్రోటోకాల్స్ కారణంగా వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ఓవర్-ది-టాప్ (ఓటీటీ) కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఉత్పన్నమయ్యే స్పామ్, మోసాలకు ఈ సాంకేతికత పరిష్కరించదని అధికారులు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు ఈ మోసాలపై అవగాహనలేని వినియోగదారులను లక్ష్యంగా చేసుకోవడానికి ఈ ఎన్‌క్రిప్టెడ్ ప్లాట్‌ఫామ్‌లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కొన్ని టెక్నికల్ కారణాలవల్ల డిజిటల్ మోసాలు పెరుగుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ ఎయిర్‌టెల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు రక్షణ కల్పించేందుకు రెగ్యులేటరీ జోక్యం చేసుకోవాలని తెలిపింది. ఓటీటీ కమ్యూనికేషన్ సేవలను రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ కిందకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)ను కోరింది. ఓటీటీ యూజర్లకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) వెరిఫికేషన్ తప్పనిసరి చేయడం, ఈ ప్లాట్‌ఫామ్‌లను సెంట్రలైజ్డ్ స్పామ్ డిటెక్షన్ సిస్టమ్స్‌లోకి ఇంటిగ్రేషన్ చేయడం వంటివి ఇందులో ఉన్నాయి.

**ఏకీకృత విధానం అవసరం..**

డిజిటల్ మోసాలకు వ్యతిరేకంగా సమగ్ర వ్యూహాన్ని రూపొందించడానికి టెలికాం ఆపరేటర్లు, రెగ్యులేటర్లు, టెక్నాలజీ ప్రొవైడర్లతో సహా వాటాదారుల మధ్య సహకారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్‌టెల్ తన ప్రయత్నాలతో ఆన్‌లైన్ మోసాలను కట్టడి చేసేందుకు ముందడుగు వేసినప్పటికీ, ఓటీటీ ద్వారా ఉత్పన్నమయ్యే మోసాలపై పోరాటానికి, అన్ని కమ్యూనికేషన్ ఛానళ్లను రక్షించడానికి ఏకీకృత విధానం అవసరమని చెబుతున్నారు.



## ఒకేరోజు 27 శాతం కుప్పకూలిన బ్యాంకు స్టాక్.. కారణం..

దేశీయ ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్ ఇండ్ బ్యాంక్ షేరు ధర మంగళవారం ఒక్కరోజే సుమారు 27 శాతం కుప్పకూలింది. నిన్నటి సెషన్‌లో షేరు ధర రూ.900.5 ముగింపు నుంచి ఈ రోజు ముగింపు సమయానికి రూ.655 వద్దకు చేరింది. బ్యాంకు ఎదుర్కొంటున్న సవాళ్లపై సీఈఓ సుమంత్ కత్పాలియా మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకుకు ఇది 'లిట్మస్ టెస్ట్'గా అభివర్ణించారు. బ్యాంకు పాలన, నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తిన కీలక పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కత్పాలియా పదవీకాలాన్ని మూడేళ్ల పాటు పొడిగించాలని బోర్డు సిఫారసు చేసినప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక సంవత్సరం వరకు మాత్రమే తన పదవీకాలం పొడిగింపును ఆమోదించింది. తన నాయకత్వ నైపుణ్యాల గురించి ఆర్‌బీఐకి ఆందోళనలు ఉండవచ్చునని కత్పాలియా అన్నారు. ఏదేమైనా ఆర్‌బీఐ నిర్ణయాన్ని గౌరవిస్తానని చెప్పారు. ఈ వ్యాఖ్యలు బ్యాంకు షేర్ ధర పడిపోవడానికి కారణమైనట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సీఈఓ స్థాయి వ్యక్తే ఇలా తన సామర్థ్యాలను అంగీకరించడంపట్ల? ఇన్వెస్టర్లలో ఆందోళన వ్యక్తం అయినట్లు తెలిపారు.అంతర్గత ఆడిట్‌లో బ్యాంక్ డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. ఇది డిసెంబర్ 2024 నాటికి ఉన్న లెక్కల ప్రకారం బ్యాంకు నికర విలువలో సుమారు 2.35% అంటే సుమారు రూ.1530 కోట్లుగా ఉన్నట్లు తేల్చారు. ఈ వ్యత్యాసాలపై స్వతంత్ర సమీక్ష నిర్వహించడానికి ఇండస్ ఇండ్ బ్యాంక్ బాహ్య ఆడిటర్‌ను నియమించింది. బ్యాంక్ వృద్ధి ఎజెండా చెక్కుచెదరకుండా ఉందని, ఈ సవాళ్లను పారదర్శకంగా పరిష్కరించడానికి నాయకత్వ బృందం కట్టుబడి ఉందని కత్పాలియా వాటాదారులకు హామీ ఇచ్చారు.

# పాక్ రైల్వే విస్తీర్ణం ఎంతో తెలుసా..?

భారత్‌కు దాయాది దేశంగా ఉన్న పాకిస్థాన్‌లో బెలూచిస్థాన్ వేర్పాటు వాదులు తాజాగా తీవ్ర కార్యకలాపాలకు పాల్పడ్డారు. పాకిస్థాన్‌కు చెందిన పాక్ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (%జ్ఞుటట్ఝుతీ ఝఇఝూతీవంం%) తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు 100కి పైగా ప్రయాణికులను బంధించారు. ఈ చర్యలను ప్రతిఘటించిన ఆరుగురు పాకిస్థాన్ జవాన్లను హతమార్చారు. పాకిస్తాన్ రైల్వే దేశవ్యాప్తంగా ముఖ్యమైన రవాణా సాధనంగా పనిచేస్తోంది. దీని విస్తృతమైన నెట్‌వర్క్ మారుమూల ప్రాంతాలను అనుసంధానించడంలో, వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో, పర్యాటకానికి మద్దతుగా నిలవడంతో తోడ్పడుతుంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న పాకిస్థాన్ ఎకనామీకి ఇలాంటి ఘటనలు కోలుకోలేని దెబ్బగా మారే ప్రమాదముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**భారత్‌తో పోలిస్తే చాలా తక్కువ..**

పాకిస్థాన్‌లో 1861లో కరాచీ నుంచి కోట్రి మధ్య మొదటి రైల్వే లైన్ ప్రారంభమైంది. బ్రిటిష్ వలసరాజ్య కాలంలో నార్త్ వెస్ట్రన్ స్టేట్ రైల్వేగా స్థాపించిన ఈ రైల్వే 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పాకిస్థాన్ రైల్వేగా మారింది. కాలక్రమేణా దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాలను కలుపుతూ నెట్‌వర్క్‌ను విస్తరించింది. ప్రస్తుతం పాకిస్థాన్ రైల్వే సుమారు 7,789 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. ఇది




భారతరైల్వే విస్తరించిన సుమారు 68,000 కిలోమీటర్ల ట్రాక్‌తో పోలిస్తే చాలా తక్కువ. పాక్ రైల్వే కేవలం 479 స్టేషన్లను కవర్ చేస్తుంది. ఈ నెట్‌వర్క్ ప్యాసింజర్, సరుకు రవాణా సేవలకు కీలకంగా మారింది.

**చైనా-పాక్ మధ్య ఎంఎల్-1 ప్రాజెక్ట్**

ఇటీవలి కాలంలో పాకిస్థాన్ రైల్వే సేవలను పెంచడానికి ఆధునీకరణ కార్యక్రమాలను ప్రారంభించింది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మెయిన్ లైన్ 1 (ఎంఎల్-1) వంటి ప్రధాన రైల్వే మార్గాలు ఏర్పాటు చేస్తుంది. ఇది కరాచీ, లాహోర్, పెషావర్ వంటి పట్టణ కేంద్రాలను కలుపుతుంది. ఎంఎల్-1 అప్‌గ్రేడేషన్ వంటి ప్రాజెక్టులు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రైలు వేగాన్ని పెంచడం, రైల్వే సామర్థ్యాన్ని విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కరాచీ నుంచి చైనాలోని పెషావర్ వరకు 1,726 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. క్రమంగా భవిష్యత్తులో ట్రాక్‌ను రెట్టింపు చేయడం, రైలు వేగాన్ని గంటకు 160 కిలోమీటర్లకు పెంచడం వంటివి ప్రాజెక్ట్ లక్ష్యాల్లో కీలకంగా ఉన్నాయి.

**ఈ ప్రాజెక్ట్ ఎందుకోసం అంటే..**


సరుకులు, ప్రయాణీకుల రవాణాను సులభతరం చేయడం ద్వారా ఈ ప్రాజెక్ట్ వాణిజ్యాన్ని పెంచుతుందని నమ్ముతున్నారు. ఇతర దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుందని, నిర్మాణ సమయంలో, తర్వాత కాలంలో కూడా వందలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థలు, డబుల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవి ఆపరేషనల్ భద్రతను మెరుగుపరుస్తాయని, ప్రమాదాలను తగ్గిస్తాయని అంచనా వేస్తున్నారు. రోడ్డు రవాణా కంటే రైలు మార్గాలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాజెక్ట్ ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ, కర్బన ఉద్గారాలను నియంత్రిస్తుందని చెబుతున్నారు.

**సవాళ్లు ఇవే..**

ఈ ప్రాజెక్ట్‌కు ప్రాముఖ్యత ఉన్నప్పటికీ పాకిస్థాన్ రైల్వే కాలం చెల్లిన మౌలిక సదుపాయాలతో నెట్టుకొస్తోంది. దేశంలో సరైన భద్రత లేకపోవడంతో తాజాగా జరిగిన ట్రెయిన్ హైజాక్ వంటి ఘటనలు పునరావృత్తమైతే ఆర్థిక వ్యవస్థపై, దేశ సమగ్రతపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే బెలుచిస్థాన్‌లో వేర్పాటు వాదులు పాకిస్థాన్‌కు పక్కలో బల్లెంలాగా పరిణమిస్తున్నారు. దేశంలో ఇప్పటికే ఆర్థిక పరిస్థితి తీవ్రరూపం దాల్చినట్లు నివేదికలు వెల్లడవుతున్నాయి. చైనా-భారత్ మధ్య చెలరేగుతున్న భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో భారత్‌కు శత్రు దేశమైన పాకిస్థాన్‌తో చెలిమి చేస్తే భవిష్యత్తులో ఆసరాగా ఉంటుందని చైనా నమ్ముతుంది. దాంతో పాక్ ప్రాజెక్ట్‌ల్లో చైనా పెట్టుబడి పెడుతోంది.



# దెబ్బకొట్టిన క్లైమాక్స్ సెంటిమెంట్



**ఈ-కబురు:** సూపర్ స్టార్ మహేష్ బాబుకి టాలీవుడ్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. ఆయన సినిమాల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం మహేష్.. రాజమౌళితో భారీ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ సినిమా ఎలా ఉంటుంది, ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.అయితే తాజాగా మహేష్ మూవీ క్లైమాక్స్‌లకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్ అవుతుంది. మహేష్ బాబు నటించిన బాబీ సినిమా కోసం రెండు క్లైమాక్స్‌లు షూట్ చేశారట. ఇప్పటి జనరేషన్ వాళ్లకి ఈ విషయం తెలియదు. మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ జంటగా శోభన్ దర్శకత్వంలో 2002లో బాబి సినిమా రూపొందింది. సినిమా మహేష్ నటించిన తొలి లవ్ స్టోరీ మూవీ కాగా, ఈ సినిమాకి మణిశర్మ మ్యూజిక్ అందించారు. ప్రకాష్ రాజ్, రఘువరన్, బ్రహ్మానందం, సునీల్, రవిబాబు ఇలా భారీ కాస్టింగ్ తో ఈ చిత్రాన్ని రూపొందించారు.'టక్కరి దొంగ ' లాంటి కౌబాయ్ మూవీ తరువాత మహేష్ నుండి వచ్చిన ఈ మూవీపై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా రిలీజ్ అయ్యాక ఫ్యాన్స్ చాలా డిజప్పాయింట్ అయ్యారు. అందుకు కారణం క్లైమాక్స్ లో మొత్తం అందరూ చనిపోతారు. హీరో మహేష్ బాబు, హీరోయిన్ ఆర్తి అగర్వాల్ కూడా పోలీస్ కాల్పుల్లో చనిపోవడంతో సినిమా ఎండ్ అయిపోతోంది. అయితే ఇది మహేష్ ఫ్యాన్స్‌ని నిరాశకు చేసింది. పెద్ద గొడవ చేశారు. సెకండ్ షో సమయానికి డిజాస్టర్ అన్నారు. దాంతో ప్రొడక్షన్ టీం హడావుడిగా మరో చిన్న సీన్ షూట్ చేసి క్లైమాక్స్ మార్చేశారు. దాని ప్రకారం సినిమాలో ఆర్తి అగర్వాల్ తండ్రి ప్రకాష్ రాజ్ వచ్చి పోలీస్ కాల్పుల్లో గాయపడిన మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ ని హాస్పిటల్ కి తీసుకువెళ్లినట్టు చూపిస్తారు.

# మళ్లీ నటించేందుకు సిద్ధంగా నటి రంభ

**ఈ-కబురు:** అలనాటి నటి రంభ మరోమారు అలరించేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే తెరంగేట్రం చేసేందుకు రెడీగా ఉన్నారు. 1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు నటి రంభ. ఈ నటి మరోసారి వెండి తెరపై సందడి చేయనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా తమిళ నిర్మాత ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వార్తలపై స్పందించారు. ఆమె రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను రీ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'రంభ ఆర్థికంగా సెటిల్ అయ్యారు. తన భర్త కూడా పెద్ద వ్యాపారవేత్త. ఆయన ఇటీవల నన్ను కలిసినప్పుడు రంభకు మంచి సినిమాలో అవకాశం ఇవ్వమని కోరారు. అలాంటి ప్రాజెక్ట్ ఏమైనా ఉంటే కచ్చితంగా ఆమెను సంప్రదిస్తానని అతడికి హామీ ఇచ్చాను' అని చెప్పారు. దీంతో త్వరలోనే ఈ నటి రీ ఎంట్రీ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.



# ఒడిషాలో నటి ప్రియాంక


**ఈ-కబురు:** ప్రస్తుతం ఎక్కడ చూసినా మహేశ్ బాబు, రాజమౌళి సినిమా ముచ్చట్లే వినిపిస్తున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో స్టార్ హీరో మహేశ్ బాబు నటిస్తున్న ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ నటి పంచుకుంటున్న తన అప్‌డేట్స్ క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా ప్రియాంక తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు, వీడియో పంచుకున్నారు. ఆ వీడియో చూస్తే, ఆమె ఒడిశా వెళ్లినట్లు తెలుస్తోంది. దానితో పాటు విమానం నుంచి చూస్తున్న ఓ స్టైలిష్ ఫొటోను కూడా ప్రియాంక షేర్ చేశారు.షూటింగ్ కోసమే ఆమె అక్కడకు వెళ్లినట్లు సమాచారం. మార్చి 10న విమానాశ్రయంలోని సిబ్బందితో ప్రియాంక దిగిన ఫొటో కూడా నెట్టింట వైరలైన విషయం తెలిసిందే. లార్జ్ దేన్ లైఫ్ కథలకు రాజమౌళి పెట్టింది పేరు. జక్కన్న ఏం చేసినా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భారీ హంగులు అద్ది ప్రేక్షకులకు అందిస్తారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త కూడా మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రాజమౌళి కాశీ నగరాన్ని చూపనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే కాశీలో షూటింగ్ నిర్వహించడం కష్టం. దీంతో నిజంగా కాశీని తలపించేలా అద్భుతమైన సెట్ వేయనున్నారట. ఈ సినిమాలోని కీలక భాగం కాశీ పట్టణానికి సంబంధం ఉంటుందని అందుకే రాజమౌళి ఈ సెట్ వేయనున్నారని సమాచారం. అడవులు, నదులు, ఆధ్యాత్మిక నగరాలు.. ఇలా విభిన్న ప్రకృతి దృశ్యాలతో ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోలేని సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు రాజమౌళి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# రికార్డులు సృష్టిస్తున్న ఛావా



**ఈ-కబురు:** విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకక్కిన 'ఛావా'రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే బీటౌన్‌లో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. సినీ ఇండస్ట్రీలో చరిత్ర సృష్టించిన 'బాహుబలి 2' రికార్డును అధిగమించింది. దీంతో విక్కీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి 2' అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు గుర్తింపు తెచ్చింది. దేశవ్యాప్తంగానూ విడుదలైన అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. హిందీలో ఈ చిత్రం రూ.510 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఇప్పుడీ కలెక్షన్లను 'ఛావా' అధిగమించింది. ఫిబ్రవరి 14న విడుదలైన 'ఛావా' ఇప్పటివరకూ బీ టౌన్‌లో రూ.516 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో 25 రోజుల్లోనే బాలీవుడ్‌లో 'బాహుబలి 2' రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించింది. అంతేకాదు హిందీ చలనచిత్ర చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో సినిమాగా 'ఛావా' నిలిచింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీని డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. థియేటర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఏప్రిల్ 11 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వస్తున్నాయి . త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందంటూ పోస్టులు షేర్ అవుతున్నాయి. ఈ చిత్రం ఓటీటీ విడుదలయ్యాక అక్కడ కూడా రికార్డులు నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.

# పాండ్యాపై ఓ మ్యాచ్ నిషేధం అమలు




**ఈ-కబురు:** ఐపీఎల్ 2025 మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ మెగా టీ20 లీగ్ 18వ ఎడిషన్ కోసం సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ టోర్నమెంట్ కోసం అన్ని జట్లు సిద్ధంగా ఉన్నాయి. కానీ, ముంబై ఇండియన్స్ డబుల్ దెబ్బను చవిచూసింది. ముంబై జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా మొదటి మ్యాచ్‌కు దూరంగా ఉండగా, ఇప్పుడు స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా మొదటి కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడు. మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఈ మ్యాచ్‌కు హార్దిక్, బుమ్రా జట్టుతో ఉండరు. ఇటువంటి పరిస్థితిలో, ప్లేయింగ్-11 ఎలా ఉంటుంది, జట్టుకు ఎవరు కెప్టెన్ అవుతారు ఇలాంటి ఎన్నో ప్రశ్నలు అభిమానులను వేధిస్తున్నాయి. మొదటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనుంది. ముంబై ఇండియన్స్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఊహించని బిగ్ షాక్ తగిలింది. అంటే, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆడడు. అందుకు గల కారణం హార్దిక్ పాండ్యాపై నిషేధం అమలులో ఉందన్నమాట. అందుకు గల కారణం, ఐపీఎల్ 2024తో ముడిపడి ఉంది. ముంబై జట్టు నిర్ణీత సమయం మేరకు బౌలింగ్ చేయడంలో విఫలమైంది. దీంతో పలుమార్లు ఇలా చేయడంతో థర్డ్ అంపైర్ ముంబై కెప్టెన్‌ను ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్ నుంచి నిషేధించారు. దీంతో హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్ ఆడడు.ఈసారి ముంబై జట్టులో ఓపెనింగ్ కోసం రోహిత్ శర్మ పేరును ఖరారు చేయనున్నారు. రోహిత్ భాగస్వామిగా విల్ జాక్స్ పేరు వినిపిస్తోంది. ర్యాన్ రికెల్టన్ కూడా ఓ ఆప్షన్. కానీ జాక్స్ అతని కంటే మెరుగ్గా ఉన్నాడు. ఇటువంటి పరిస్థితిలో, ఈ ఇంగ్లీష్ ఆటగాడు రోహిత్‌తో కలిసి ఓపెనింగ్ చేయగలడు.మిడిల్ ఆర్డర్- తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రాబిన్ మింజ్ ముంబై ఇండియన్స్ తరపున హార్దిక్ పాండ్యా తొలి మ్యాచ్‌లో ఆడకపోవడంతో, జట్టు ఆధిక్యం సూర్యకుమార్ యాదవ్ చేతిలో ఉండవచ్చు. సూర్య జట్టు తరపున మిడిలార్డర్‌లో కూడా బ్యాటింగ్ చేస్తాడు.

# నాకు రావాల్సిన గుర్తింపు రావడం లేదు

**ఈ-కబురు:** కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) కెప్టెన్‌గా ఐపీఎల్ 2024 సీజన్ టైటిల్ గెలిచినా.. తనకు రావాల్సిన గుర్తింపు రాలేదని టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. అయినా తాను హార్డ్ వర్క్‌ను కొనసాగించానని తెలిపాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే కేకేఆర్ టైటిల్ గెలిచింది. శ్రేయస్ అయ్యర్ కంటే ఆ జట్టు మెంటార్‌గా గౌతమ్ గంభీర్‌కే ఎక్కువ గుర్తింపు లభించింది.కెప్టెన్‌గా టైటిల్ అందించినా.. శ్రేయస్ అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. దాంతో అతను ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి రాగా.. పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసి తమ కెప్టెన్‌గా నియమించింది. తాజాగా జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో శ్రేయస్ అయ్యర్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అసాధారణ బ్యాటింగ్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. 5 మ్యాచ్‌ల్లో 243 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో అక్షర్ పటేల్, విరాట్ కోహ్లీలతో కలిసి కీలక భాగస్వామ్యాలను నమోదు చేశాడు. %జ%ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో రాణించడం చాలా సంతృప్తినిచ్చింది. నిజం చెప్పాలంటే.. ఇదో ఒక ప్రయాణం. నా జీవితంలోని ఈ దశలో నేను చాలా నేర్చుకున్నాను. వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం నేను బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాను. దాంతో నేను ఎక్కడ తప్పు చేశాను ఏమి చేయాలా నా ఫిట్‌నెస్ ఎంత మెరుగుపర్చుకోవాలి అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.




# ముంబైకి చేరుకున్న రోహిత్ శర్మ



**ఈ-కబురు:** దుబాయ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని గెలుచుకున్న భారత జట్టు స్వదేశానికి చేరుకున్నాక గ్రాండ్ వెల్‌కమ్ ఉంటుందని క్రికెట్ ప్రేమికులు భావించారు. గత ఏడాది టీ20 వరల్డ్ కప్ నెగ్గిన అనంతరం భారత్‌కు చేరుకున్న రోహిత్ శర్మ సారథ్యంలోని జట్టుకు ఏ లెవెల్ లో ఘన స్వాగతం లభించిందో అందరూ చూశారు. అయితే ఈసారి అలాంటి సీన్ రిపీట్ అయ్యే అవకాశమే లేదు. వుమెన్ ప్రీమియర్ లీగ్ ఉండటంతో సెక్యూరిటీ ప్రాబ్లమ్ తలెత్తుతుందని ఆటగాళ్లకు గ్రాండ్ వెల్కమ్ లభించడం లేదు. మరోవైపు మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ మొదలు కానుంది. దాంతో ఆటగాళ్లు తమ స్వస్థలాలకు వెళ్లి, వెంటనే ఐపీఎల్ టీమ్ తో కలిసి ప్రాక్టీస్ మొదలుపెట్టాల్సి ఉండటం మరో కారణంగా కనిపిస్తోంది.



# లక్నోకు ఊహించని షాక్..

**ఈ-కబురు:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముగిసిన తర్వాత, ఇప్పుడు అభిమానులు ఐపీఎల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభానికి ఇంకా ఎక్కువ రోజులు లేవు. ఒకవైపు ఈ టోర్నమెంట్ పట్ల అభిమానుల్లో విపరీతమైన ఉత్సాహం నెలకొనగా.. మరోవైపు చాలా మంది ఆటగాళ్లకు గాయాలతో జట్లకు సమస్యలను పెరిగాయి. గాయం కారణంగా జస్‌ప్రీత్ బుమ్రా కొన్ని మ్యాచ్‌లలో ఆడలేడని ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు మరో స్టార్ బౌలర్ గాయపడి ఐపీఎల్ మొదటి అర్ధభాగానికి దూరంగా ఉండవచ్చని వార్తలు వస్తున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ గాయం కారణంగా ఐపీఎల్ మొదటి అర్ధభాగంలో ఆడలేడు. , మయాంక్ యాదవ్ తన గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ చేయడం ప్రారంభించాడు. గత ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అతను గాయపడ్డాడు. అప్పటి నుంచి పునరావాస ప్రక్రియలో ఉన్నాడు. మయాంక్ యాదవ్ ఎప్పుడు పూర్తిగా ఫిట్ అవుతాడో బీసీసీఐ ఇంకా చెప్పలేదు. కానీ, అతను అన్ని పారామితులను దాటినప్పటికీ, ఐపీఎల్ రెండవ సగం నాటికి మాత్రమే తిరిగి రాగలడని చెబుతున్నారు.